మాలే చూస్తాడు....

"ఇప్పుడైనా తెలిసిందా మరి .... అది కూడా ఒక ప్రాంతీయ భాషేనని.... అన్ని ప్రాంతాలను అభిమానించడమే దేశాన్ని అభిమానించడం అవుతుందని.... ఎవరేవి రాసినా తన మోహంమీద.... కిమ్మనకుండా ఊర్కొంటుందేగోడ.... అలాంటి గోడవు కాకు. ఎవరేది చెప్తే అది ఒప్పేసుకోకు.... నీకు మెదడు, జ్ఞానం ఉంది.... ఆలోచించు .... ఉత్తరాన హిమాలయాల్నించి దక్షిణాన కన్యాకుమారి వరకు ప్రతి అంగుళం నేల భారతదేశమే.... తెలుగును అభిమానిస్తే.... తెలుగు ప్రాంతాన్ని అభిమానిస్తే భారత దేశాన్ని అభిమానించినట్లే అది దేశద్రోహం కాదు. ఉత్తరప్రదేశ్ వాలా గోబ్యాక్, మధ్య ప్రదేశ్ వాలా గోబ్యాక్.... మద్రాసీ వాలా గోబ్యాక్, కేరళ వాలా గోబ్యాక్.... ఆంధ్రా గో బ్యాక్.... తెలంగాణా గో బ్యాక్ .... రాయలసీమా గో బ్యాక్ అంటే అది సంకుచితత్వం.... దేశ ద్రోహంగాని.... తెలుగు ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పం దేశద్రోహం కాదు. ఏవీధి వాళ్ళు ఆ వీధిని శుభ్రంగా ఉంచుకుంటేనేనగరం శుభ్రంగా ఉంటుంది. అంతేకాని నగరమనేది శుభ్రంగా ప్రత్యేకంగా ఆకాశం నుంచి ఊడి పడదు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధిచెందుతుంది. ఊక దంపుడు ఉపన్యాసాలు మాని తెలుగు నేల అభివృద్ధికి పాటుపడమని ఫలానా నాయకులకు చెప్పడం మంచిది. అదే జాతీయ సేవ.... దేశ సేవ.... వింటున్నావా రాంబాబూ...."

"వింటున్నా వీణా.... నువ్వు చెప్పిందే నిజం.... ఫలానా నాయకుల పిచ్చిమాటలు నమ్మి దేశద్రోహం చేయబోయాను.... ఇక అస్సలు వాళ్ళమాటలు నమ్మను" ●

## వాళ్ళు-వీళ్ళు

వీళ్ళేమో
ఉత్తుత్తి మాటలకే భ్రమసి
ఊళ్లేం నిస్తున్నారు వాళ్ళని!
వాళ్లేమో
కొత్త కొత్త చట్టాలు తెచ్చి
పెంచేస్తున్నారు జైళ్ళని!

-సౌభాగ్య

# మినీకథ

## చందమామ ఎరుపెక్కింది

వేసవి. ఎండ వేడిమిని. ఉక్కను భరించలేక ఏదైనా ఏ.సి. థియేటర్‌లో మేట్నీ షో చూద్దామని బయల్దేరాను–

"ప్యార్ ఝుక్‌తా నహీ"– హిందీ సినిమా.

పెద్ద రద్దీగావేమీలేదు. తేలిగ్గా టికెట్ తీసుకొని థియేటర్‌లోకి నడిచాను.

ఏ.సి. చల్లదనం ఎంతో ఆహ్లాదాన్ని కల్గిస్తోంది.

హాలు క్రమేణా ప్రేక్షకులతో నిండిపోతోంది. ఇంతలోకాలేజ్ స్టూడెంట్స్ కాబోలు యిద్దరమ్మాయిలు వచ్చి నా ముందు వరసలో కూర్చున్నారు. వారి వెనగ్గానే మరో ఇద్దరు కుర్రాళ్లు వచ్చి నా ప్రక్క సీట్స్‌లో బైఠాయించారు–

ఇంకా సినిమా ప్రారంభం కావడానికి ఓ ఐదు నిమిషాలైనా టైముపుంటుంది.

అందాక ఓ సిగరెట్ ముట్టిద్దామన్న ఆలోచనొకల్గి సీట్లోంచి లేవబోతుండగా–

"అబ్బ! తెల్లని చందమామ గురో" అన్నాడు నా ప్రక్క కూర్చున్న కుర్రాడు.

ఎవరినుద్దేశించి అన్నదీ నాకు తెలుస్తూనే వుంది.

ముందు సీట్లో కూర్చున్న అమ్మాయి గిరుక్కున వెనుదిరిగి కిసుక్కున నవ్వింది.

పొంగిపోయారు నా ప్రక్క సీట్లోని కుర్రాళ్ళు.

లవ్‌బర్డ్స్ అనుకున్నాన్నేను.

"మీరు కొంచెం ప్రక్కకు వస్తారా" అందా అమ్మాయి నాతో చిలిపిగా ఏమనను? పావకంలో పుడకలా వాళ్ళ మధ్య నేనెందుకు? అనుకొన్నా–

నేను తొలిగాను........ ఆ అమ్మాయి నా సీటు దగ్గర కొచ్చింది. అంతే! కుర్రాడి చెంప పేలిపోయింది–

"ఎలా వుందిరా రాస్కెల్ చందమామా?.... తెల్లగావుందా? ఎర్రగావుందా?" ఆవేశంగాఅంది.

అప్పుడే లైట్స్ ఆఫ్ అయ్యాయి.

పిక్చర్ స్టార్ట్ అయింది.

—శ్రీమతి డి. శాంతకుమారి

## కళ్ళడాక్టర్



"అయ్యా! కళ్ళులేని వాడిని. ధర్మం చెయ్యండయ్యా" అంటూ వచ్చాడు బిక్షగాడు.

"ఆహా! ఎన్నాళ్టికి నాకీ భాగ్యం కలిగినది. రాబాబు కళ్ళు పరీక్ష చేస్తాను." అన్నాడు డా॥ చిదానందం.

—యం. మనోరంజన్ బాబు
(గుంటూరు)